

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అభివృద్ధి పనుల్లో అలసత్వం వద్దు

» వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

కొడంగల్/వికారాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో అలసత్వం వహించొద్దని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. సోమవారం కొడంగల్ పట్టణంలోని కడా కార్యాలయంలో అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కడా అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయల బడ్జెట్‌ను కేటాయించిందన్నారు. పనుల్లో జాప్యం జరిగితే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. పాఠశాలల్లో మోడ్రన్ టాయిలెట్స్ నిర్మాణాలను చేపట్టాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఈఈ సత్యనారాయణరెడ్డి, సీపీవో వెంకటేశ్వర్లు, మిషన్ భగీరథ ఈఈ రవికుమార్, జిల్లా అటవీ శాఖ అధికారి జ్ఞానేశ్వర్, అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన 86 వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష చౌదరి, డీఆర్‌వో మంగీలాల్, ఆర్డీవో వాసుచంద్ర, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పంట నష్టంపై సీఎం ఆరా

భారీ వర్షాలు, వరద సహాయంపైన సెక్రటరియేట్ నుంచి సీఎం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ ప్రతీక్ జైన్, సబ్ కలెక్టర్ ఉమాశంకర్‌ప్రసాద్, అసిస్టెంట్ కలెక్టర్ హర్ష్ చౌదరి హాజరయ్యారు. సోమవారం సాయంత్రం కొడంగల్ కడా కార్యాలయం నుంచి హాజరయ్యారు. కాగా, ఎస్పీ, అదనపు కలెక్టర్, ఇతర అధికారులు కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా భారీ వర్షాలతో జరిగిన నష్టంపై సీఎం ఆరా తీశారు.

కేబుళ్ల తొలగింపుతో ఇక్కట్లు

ఘట్‌కేసర్‌లో నిలిచిన ఇంటర్నెట్ సేవలు

ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు అంతరాయం

7

వడివడిగా..

ఇండస్ట్రియల్ కారిడార్ పనులు షురూ

లగచర్ల ఇండస్ట్రియల్ కారిడార్ పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే భూసేకరణ పూర్తయిన ప్రాంతాల్లో హద్దులను గుర్తించి ప్రహరీ నిర్మాణానికి యంత్రాలు, కూలీలను సిద్ధం చేశారు. హకీంపేట్, లగచర్ల, ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకు తాత్కాలిక షెడ్‌లను ఏర్పాటు చేశారు. అలాగే పొలాలను చదును చేసే ప్రక్రియను వేగవంతం చేశారు. 1,178 ఎకరాల భూసేకరణకు నోటిఫికేషన్ ఇవ్వగా ఇప్పటివరకు 974 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించారు.

ప్రహరీ నిర్మాణానికి హద్దుల గుర్తింపు

పనుల కోసం యంత్రాలు, కూలీలు సిద్ధం

1,178 ఎకరాల భూ సేకరణకు నోటిఫికేషన్

ఇప్పటి వరకు 974 ఎకరాల సేకరణ పూర్తి

రూ.200 కోట్లకుపైగా పరిహారం చెల్లింపులు

నిత్యం పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు



పోలెపల్లిలో సేకరించిన భూముల్లో యంత్రాలతో చదును



సేకరించిన భూముల్లో కూలీల కోసం ఏర్పాటు చేసిన తాత్కాలిక షెడ్లు

కొడంగల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నియోజకవర్గమైన కొడంగల్ ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. గతంలో భూ సేకరణ సమయంలో రైతుల నిర్బంధాలు, ప్రతిఘటనలు, నిరసన వ్యక్తం చేయగా అధికారులు రైతులతో సంప్రదింపులు జరిపి భూ సేకరణకు చర్యలు తీసుకున్నారు. అధికారుల సూచనల మేరకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భూ సేకరణకు సహకరించారు. దీంతో దుద్యాల మండలంలోని లగచర్ల, పోలెపల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో ఏర్పాటు చేయనున్న ఇండస్ట్రీయల్ కారిడార్ పనులను అధికారులు వేగవంతం చేశారు. ఇందుకు అవసరపడే

మిగతా 8వ పేజీలో...

అధికారుల పర్యవేక్షణతో..

ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణ పనులకు కలెక్టర్‌తో పాటు అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇందులో భాగంగా భూ సేకరణ అనంతరం హద్దుల ఏర్పాటుతో ప్రహరీ నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. ఇందుకు కావాల్సిన వనరులను సైతం ఇప్పటికే సమకూర్చారు. హకీంపేట్, లగచర్ల, ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకు షెడ్‌లను ఏర్పాటు చేసి పనులపై దృష్టి సారించారు. అలాగే సేకరించిన పొలాలను చదును చేయడం ప్రారంభించారు. పనుల వేగవంతానికి తాండూర్ సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్, తహసీల్దార్ కిషన్‌నాయక్ నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

ఆరు ఎకరాల భూమి ఇచ్చిన



నాకున్న ఆరు ఎకరాల భూమిని ఇండస్ట్రీయల్ కారిడార్ నిర్మాణానికి ఇచ్చాను. ఈ భూమికి సంబంధించి పరిహారం సైతం అందింది. ఈ ప్రాంతంలో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటుతో అభివృద్ధితో పాటు నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని భావిస్తున్నాం.

-యాదయ్య, రైతు, హకీంపేట్

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ మను చౌదరి

సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

మేడ్చల్ కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ప్రజావాణి దృష్టికి వచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి సంబంధిత అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు రాధికగుప్తా, విజయేందర్‌రెడ్డిలతో కలిసి ఆయన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వ్యయ, ప్రయాసాలకోర్చి వారి సమస్యలను పరిష్కారిస్తామనే నమ్మకంతో ప్రజలు తమ వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. దరఖాస్తుల పరిశీలనలో జాప్యం లేకుండా చూడాలన్నారు. అలాగే తిరస్కరించే దరఖాస్తుల గురించి సరైన సమాచారం అందజేయాలని అధికారులకు సూచించారు. ప్రజావాణిలో మొత్తం 88 దరఖాస్తులు స్వీకరించారు.

తాండూరు రేంజ్‌లో స్వప్నకు అదనపు బాధ్యతలు



తాండూరు రూరల్, సెప్టెంబర్ 1 (ఆంధ్రజ్యోతి): తాండూరు అటవీ రేంజ్ పరిధిలో అదనపు సెక్షన్ ఆఫీసర్‌గా స్వప్న సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్‌గా పనిచేసిన ఆర్.రవి ఉద్యోగ విరమణ పొందడంతో ఈ బాధ్యతలు ఆమెకు అప్పగించినట్లు రేంజ్ అధికారి శ్రీదేవి సరస్వతీ తెలిపారు. తట్టేపల్లి సెక్షన్ ఆఫీసర్‌గా కొనసాగుతున్న స్వప్నకు తాండూరు రేంజ్‌లో అదనపు బాధ్యతలు అప్పగించామని ఆమె తెలిపారు.

సీపీఎస్‌ను వెంటనే రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

వికారాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు శాపంగా మారిన కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం (సీపీఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ విధానం(ఓపీఎస్) అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఉద్యోగుల జేఏసీ జిల్లా చైర్మన్ శివకుమార్ డిమాండ్ చేశారు. సీపీఎస్ విమోచన దినోత్సవం పురస్కరించుకుని సోమవారం జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు, కార్మికులు కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో రాష్ట్రంలో తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సీపీఎస్ విధానం తొలగించి ఓపీఎస్ విధానం తీసుకువస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం తమ హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అజ్మత్ పాషా, వెంకటరత్నం, సత్యనారాయణరెడ్డి, సుదర్శన్, ఇజాజ్ అహమ్మద్, అఫ్జల్, రామకృష్ణ, తదితరులు హాజరయ్యారు. అనంతరం హైదరాబాద్‌లో జరిగిన మహాధర్నాకు తరలివెళ్లారు.



తాండూరు జిల్లా ఆస్పత్రిలో రోగులతో నిండిన బెడ్లు

జిల్లాలో 43 డెంగీ కేసులు నమోదు

ఆస్పత్రులకు పెరిగిన రోగుల తాకిడి

రిస్క్ ఏరియాలుగా తాండూరు, వికారాబాద్

అప్రమత్తమైన వైద్యారోగ్య అధికారులు

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు

విష జ్వరాల పంజా

రోజుకు 300 వైరల్ ఫీవర్ కేసులు

తాండూరు, సెప్టెంబరు1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజనల్ వ్యాధులు తాండవం చేస్తున్నాయి. తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రితో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న 25 ప్రాథమిక హెల్త్ సెంటర్లకు రోగుల తాకిడి పెరిగింది. జిల్లాలో గతేడాది మాదిరిగానే డెంగీ కేసుల సంఖ్యగా భారీగా పెరుగుతోంది. గతేడాది 125 డెంగీ కేసులు నమోదు కాగా, ఈ ఏడాది ఇప్పటివరకు 43 నమోదయ్యాయి. కాగా, తాండూరులోనే 13 కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు.



తాండూరు జిల్లా ఆస్పత్రిలో చికిత్స కోసం బారులు తీరిన రోగులు

తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీలను రిస్క్ ఏరియాలుగా వైద్య ఆరోగ్య శాఖ గుర్తించింది. వైద్య ఆరోగ్య శాఖ నిర్వహిస్తున్న ఫీవర్ సర్వే ఆధారంగా జిల్లాలో రోజుకు 300 మంది వైరల్ ఫీవర్ బారిన పడుతున్నారు. ప్రతీ శుక్రవారం నిర్వహించే డ్రైడేను ప్రస్తుతం రోజూ నిర్వహిస్తున్నారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో కూడా వైరల్ ఫీవర్‌తో అడ్మిట్ అవుతున్న

మిగతా 8వ పేజీలో...

ఎవరూ ఆందోళన చెందొద్దు



జిల్లా ఆస్పత్రి, పీహెచ్‌సీల్లో సీజనల్ వ్యాధులకు సంబంధించి సరిపడా మందులు అందుబాటులో ఉన్నాయి. వీటితో పాటు పాము, కుక్క కాటుకు కూడా మందులు ఉన్నాయి. డెంగీ కేసు నమోదైన వారి కుటుంబ సభ్యులందరికీ రక్తనమూనాలను సేకరించి పరీక్షలు చేస్తున్నాం. అత్యవసరమైన చోట మెడికల్ క్యాంప్‌లు ఏర్పాటు చేస్తాం. ఎవరూ ఆందోళన చెందొద్దు.

-రవీంద్ర యాదవ్, జిల్లా ఉప వైద్యాధికారి



మృతి చెందిన చేపలను చూపుతున్న మత్స్యకారులు

వ్యర్థాలతో చేపలు మృత్యువాత

» లక్షల్లో నష్టం వాటిల్లిందని మత్స్యకారుల ఆవేదన

» ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో దుస్థితి

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రసాయన వ్యర్థాలు చెరువులో కలవడం వలన వేల సంఖ్యలో చేపలు మృత్యువాత పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు ఆదివారం జవహర్‌నగర్ డంపింగ్ యార్డు నుంచి రసాయన వ్యర్థాలు ఎరిమల్లేవాగు ద్వారా ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో కలిశాయి. సోమవారం ఉదయం మత్స్యకారులు చెరువులోకి వెళ్లి చేస్తే ఘనాపూర్ సమీపంలో పెద్ద సంఖ్యలో చేపలు మృతి చెంది తేలుతూ కనిపించాయి. మరి కొన్ని చేపలు కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ కనిపించాయి. వెంటనే మత్స్యకారులు మృతి చెందిన చేపలతో పాటు మిగతా చేపలన్నింటిని బయటకు తీశారు. పది లక్షల విలువ చేసే చేప పిల్లలను ఇటీవల చెరువులోకి వదిలి పెట్టామని వారు వాపోయారు. చిన్నచేపల నుంచి దాదాపు 4 కిలోల చేపల వరకు మృత్యువాత పడ్డాయని, దీంతో తమకు లక్షల్లో నష్టం వాటిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు మూసీనది కాలష్యంతో ఇబ్బందులు పడుతుంటే మరో వైపు జవహర్‌నగర్ డంపింగ్ యార్డు వ్యర్థాలతో చేపలు మృత్యువాతతో తమకు తీరని నష్టం చేకూరిందన్నారు. ఏటా జవహర్‌నగర్ నుంచి వ్యర్థాలు చెరువులో కలవడం.. చేపలు మృతి చెందడంతో అప్పుల పాలు అవుతున్నామని ఆవేదన వ్యక్త చేస్తున్నారు. కార్యక్రమంలో ఎదులాబాద్ గంగ పుత్ర సంఘం అధ్యక్షుడు పూస యాదగిరి, కార్యదర్శి పూస నర్సింగ్‌రావు, గంగపుత్ర సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు నివేదిస్తాం

ఎదులాబాద్ చెరువులో మృతి చెందిన చేపలను జిల్లా మత్స్యశాఖ అధికారి సుకీర్తి పరిశీలించారు. చేపలు చనిపోయిన తీరును అడిగితెలుసుకున్నారు. చేపలను పరిశీలించి చెరువులో నీటిని ల్యాబ్‌కు పంపించి పరీక్షించాలని తెలిపారు. చేపలు చనిపోయిన విషయాన్ని కలెక్టర్‌కు నివేదించనున్నట్లు ఆమె తెలిపారు. ఆమెతో పాటు తహసీల్దారు డీఎస్ రజిని, అర్ఐ కావ్య, జూనియర్ అసిస్టెంట్‌లు శ్రీనివాస్‌రెడ్డి, విఠల్ తదితరులు తదితరులు పాల్గొన్నారు.

తప్పని యూరియా పాట్లు

పెద్దేముల్‌లో తోపులాట.. కిందపడిన రైతు..

మోమిన్‌పేట్‌లో చెప్పులను క్యూలో ఉంచిన రైతులు

పెద్దేముల్/ ధారూరు/ మోమిన్‌పేట్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రోజులు గడుస్తున్నా జిల్లాలో రైతులకు యూరియా తిప్పలు తప్పడం లేదు. తెల్లవారుజాము నుంచే దుకాణాలు, పీఏసీఎస్ సెంటర్ల వద్ద బారులు తీరున్నారు. పలుచోట్ల యూరియా సంచులకోసం తోపులాటలు జరుగుతుండటం గమనార్హం. సోమవారం పెద్దేముల్, ధారూర్, మోమిన్‌పేట్ మండలాల్లో రైతులు నానా పాట్లు పడ్డారు. పెద్దేముల్ మండల కేంద్రంలోని రైతుసేవ సహకార సంఘానికి 220 యూరియా బస్తాలు వచ్చాయి. విషయం తెలుసుకున్న స్థానిక రైతులు సోమవారం తెల్లవారగానే సొసైటీ వద్దకు చేరుకున్నారు. పెద్ద సంఖ్యలో రైతులు రావడంతో అంతా ఒకేసారి ఎగబడ్డారు. దీంతో రైతుల మధ్య తోపులాట జరిగింది. ఈ తోపులాటలో బిల్లిపురం పెద్దమల్లప్ప అనే రైతు కిందపడటంతో

మిగతా 8వ పేజీలో...



పెద్దేముల్ రైతుసేవ సహకార సంఘం వద్ద రైతుల బారులు



సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

కాళేశ్వరంపై కాంగ్రెస్ కుట్ర

» మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై కాంగ్రెస్ కుట్ర చేస్తుందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఆరోపించారు. సోమవారం వికారాబాద్ పట్టణంలోని బీజేఆర్ చౌరస్తాలో ఈ మేరకు పార్టీ నాయకులతో కలిసి సీఎం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపైన కాకుండా కేవలం కాళేశ్వరంపైన చర్చలు జరుపడం దారుణమన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కలిసి కాళేశ్వరంపె చేస్తున్న ఈ కుట్రలను ప్రజలు సహించరన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు కార్యక్రమంలో శుభప్రద్ పటేల్, గోపాల్, మేక చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సరిపడా యూరియా సరఫరా చేయాలి

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): రైతులు వేసిన పంటలకు సరిపడా ప్రభుత్వం యూరియా సరఫరా చేయాలని రంగారెడ్డి జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొంతం మాధవరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ప్రభులింగం డిమాండ్ చేశారు. సోమవారం ఇబ్రహీంపట్నం మండల పరిషత్ వద్ద ధర్నా నిర్వహించి ప్రజావాణిలో ఆర్డీవో అనంతరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. వరి నాట్లు వేసిన నెల రోజుల్లోపే యూరియా చల్లాల్సి ఉండగా సరఫరా లేక దుకాణాలు, ప్యాక్స్‌ల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారని, ఇంతటి దౌర్భాగ్యం మరోటి లేదన్నారు. డీలర్లు యూరియాను బ్లాక్ మార్కెట్ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరిపై ఒకరు దుమ్మెత్తి పోసుకుంటూ సమస్యను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. రైతులందరికీ రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. రెండు లక్షల వరకు రుణ మాఫీకాని రైతులకు వెంటనే మాఫీ చేయకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోచమోని నీలమ్మ, ఇబ్రహీంపట్నం, బాలాపూర్ మండల సీపీఐ కార్యదర్శులు కావలి సురేష్, చంద్రశేఖర్‌రెడ్డి, నర్సింహ, విజయ్‌కుమార్‌పాల్గొన్నారు.


మండల పరిషత్ వద్ద ధర్నా చేస్తున్న రైతు సంఘం నాయకులు

రైతులకు యూరియా అందించని ప్రభుత్వాలు

షాబాద్: రైతులకు యూరియా అందించడంలో ప్రభుత్వాలు విఫలమైయ్యాయని సీపీఐ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం అన్నారు. సోమవారం ఆయన మాట్లాడారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య సమన్వయం లేక యూరియా కష్టాలు తీవ్రమైయ్యాయని, రోజూ యూరియా కోసం రైతులు క్యూలో నిల్చుంటున్నా దొరకని పరిస్థితి ఉందన్నారు. సింగిల్ విండో, వ్యవసాయశాఖ అధికారులు సమస్య పరిష్కారానికి దృషిసారించాలన్నారు.


చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

పేదల ఆకాంక్షల మేరకు కాంగ్రెస్ పాలన

ఆమనగల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రజాభీష్టానికనుగుణంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి మండలాల్లో సోమవారం ఆయన పర్యటించి అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పలువురికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కాంగ్రెస్ అంటేనే పేదల పార్టీ అని, ఆ పార్టీ పాలనలో ప్రతీ కుటుంబానికి మేలు జరుగుతుందని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులనే గెలిపించాలని, అలా అయితే అభివృద్ధి మరింత వేగిరం అవుతుందని కసిరెడ్డి అన్నారు. ట్రిపుల్ ఆర్ నిర్మాణానికి భూములు లాక్కోవద్దని తలకొండపల్లి మండలం ఖానాపూర్, మెదక్‌పల్లి, రాంపూర్, వెంకట్రావ్‌పేట గ్రామాల రైతులు ఎమ్మెల్యేకు విన్నవించారు. కార్యక్రమాల్లో భట్టు కిషన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రావు, వెంకట్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, సురేందర్‌రెడ్డి, సుమన్, అనంతరెడ్డి, రమణారెడ్డి, గుర్రం కేశవులు, భాస్కర్‌రెడ్డి, విజయ్‌రాథోడ్, రవీందర్, బొజ్జ సాయిరెడ్డి పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ పనులు చేపట్టండి

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): 20ఏళ్లుగా హామీలకే పరిమితమైన లక్ష్మీదేవిపల్లిరిజర్వాయర్ పనులపై హామీలిస్తూ పోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే పనులను చేపట్టాలని పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ రాఘవాచారి డిమాండ్ చేశారు. షాద్‌నగర్ పెన్షనర్స్ భవనంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండేళ్లవుతున్నా పనులు చేపట్టడం లేదన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపడతామని ఎన్నికల్లో నాయకులు హామీ ఇస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పథకం ప్రకారం షాద్‌నగర్ నియోజకవర్గాన్ని రంగారెడ్డి జిల్లాలో విలీనం చేసి రియల్ ఎస్టేట్ వ్యాపారాన్ని కొనసాగించారన్నారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్, చేవేళ్ల-ప్రాణహిత ప్రాజెక్టులను నిర్మిస్తామన్న కాంగ్రెస్ పాలకులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. నిధులు కేటాయించి, నిర్మాణం చేపట్టేలా షాద్‌నగర్, పరిగి ఎమ్మెల్యేలు శంకర్, రామ్మోహన్‌రెడ్డిలు కృషిచేయాలని రాఘవచారి కోరారు. సమావేశంలో సంఘం నాయకులు కె.రవీంద్రనాథ్, ఎం.నర్సింహులు, వి.రామారావు, తిరుమలయ్య, అర్జునప్ప, జైపాల్‌రెడ్డి, ఖాజా షబ్బీర్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న రాఘవాచారి


ప్రీతమ్‌ను సన్మానిస్తున్న శంకర్, అశోక్, భాస్కర్‌రెడ్డి

అభివృద్ధే కాంగ్రెస్‌ను గెలిపిస్తుంది

కడ్తాల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ మరో ఘన విజయాన్ని సొంతం చేసుకుంటుందని రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్ అన్నారు. కడ్తాలలో సోమవారం ప్రీతమ్ స్థానిక నేతలతో సమావేశమయ్యారు. ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి కార్యాలయంలో ఆయన మాట్లాడారు. బీసీల శ్రేయస్సు కోసం స్థానిక సీట్లలో 42శాతం రిజర్వేషన్ల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుంటే బీజేపీ, బీఆర్‌ఎస్‌లు అడ్డుకుంటున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో శంకర్, అశోక్, రామకృష్ణ, చందోజీ, లక్‌పతినాయక్, జహంగీర్ అలీ, రాజేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఆపడం లేదని విద్యార్థుల ధర్నా

బషీరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): బస్సులను ఆపడంలేదని కొర్విచెడ్ గ్రామ విద్యార్థులు, తల్లిదండ్రులు సోమవారం ఆర్టీసీ బస్సును అడ్డుకుని ధర్నాకు దిగారు. కొర్విచెడ్ వద్ద రిక్వెస్ట్ స్టాప్‌లో ఏళ్లుగా బస్సులను నిలిపేవారని, ప్రస్తుతం ఎందుకు ఆపడం లేదని డ్రైవర్‌పై మండిపడ్డారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న యూత్ ప్రభంజనం వ్యవస్థాపకుడు శ్రీనివాస్ ఆర్టీసీ డ్రైవర్‌తో మట్లాడారు. ఈ విషయమై ఎమ్మెల్యే పీఏ బషీరాబాద్ ఎస్‌ఐ నుమాన్‌అలీకి శ్రీనివాస్ సమాచారం అందించారు. ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ఆదేశాలతో పీఏ ఆర్టీసీ అధికారితో మట్లాడి బస్సు ఆపేందుకు చర్యలు తీసుకోవడంతో విద్యార్థులు ధర్నాను విరమించారు.


కొర్విచెడ్ వద్ద ధర్నాకు దిగిన విద్యార్థులు, తల్లిదండ్రులు


అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

శ్మశానవాటికకు భూమి కేటాయించొద్దు

కొత్తూర్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): కొడిచర్లతండాలో సర్వే నంబర్ 198లోని ప్రభుత్వ భూమిని క్రిష్టియన్ శ్మశానవాటికకు కేటాయించొద్దని మాజీ ఎంపీటీసీ బి.రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సంతోష్‌నాయక్‌ల ఆధ్వర్యంలో గ్రామస్తులు అదనపు కలెక్టర్ చంద్రారెడ్డికి సోమవారం ఫిర్యాదు చేశారు. క్రిష్టియన్ శ్మశానవాటికకు భూమి కేటాయించేలా రెవెన్యూ అధికారులు సర్వేచేస్తున్నారని తెలిపారు. కొడిచర్లతండాకు పంచాయతీ భవనం లేక ప్రజలు ఇబ్బందులకు పడుతున్నారని, ఇదే భూమిలో పంచాయతీ కార్యాలయాన్ని నిర్మించాలని కోరారు. ఇందుకు అదనపు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. బిచ్యానాయక్, వెంకటయ్య, దేవేందర్, శంకర్‌నాయక్, రెడ్యానాయక్ పాల్గొన్నారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మర్పల్లి, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి ప్రభుత్వం అందిస్తున్న సీఎం సహాయనిధి అండగా నిలుస్తోందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మండలంలోని సిరిపూరం గ్రామానికి చెందిన గడిల సుమిత్ర సోమవారం అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ప్రభుత్వం ద్వారా ఆమెకు మంజూరైన రూ.5లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ.. వికారాబాద్ నియోజకవర్గ ప్రజలను ఆదుకునేందుకు ఎల్లవేళలా ముందుంటానని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతీ గ్రామంలో సీఎంఆర్‌ఎఫ్ సహాయనిధి చెక్కులను అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాములుయాదవ్, రఘుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.


చెక్కు అందిస్తున్న ప్రసాద్‌కుమార్

ప్రసాద్‌ను కలిసిన నాయకులు

ఆమనగల్లు : రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను సోమవారం ఆమనగల్లు మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. కొండారెడ్డిపల్లిలోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో సీఎం సోదరుడు కృష్ణారెడ్డితో ప్రసాద్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. కల్వకుర్తి అభివృద్ధికి ప్రభుత్వ పరంగా తోడ్పాటునందించాలని కోరారు. స్పీకర్‌ను కలిసిన వారిలో రూపం వెంకట్‌రెడ్డి, భాస్కర్, కుమార్‌గౌడ్ ఉన్నారు.

మాట నిలుపుకున్న కాంగ్రెస్

» డీసీసీ అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి) బీసీలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ అసెంబ్లీలో బిల్లును ఆమోదించన సందర్భంగా సోమవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయం వద్ద టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ బీసీల రిజర్వేషన్ పట్ల బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు పక్షపాత ధోరణిని అవలంబిస్తున్నాయన్నారు. బీజేపీ కేంద్రంలో వ్యతిరేకిస్తూ రాష్ట్రంలో సమర్థిస్తూ రెండు నాలుకల ధోరణిని అవలంబిస్తుందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలో నేడు రాష్ట్రంలోని బీసీలకు రిజర్వేషన్ కల్పించడం హర్షణీయమన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గజ్జల కాంతం మాట్లాడుతూ బీజేపీ కుల, మత రాజకీయాలతో సమాజంలో చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి శశికళ యాదవరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్, వజ్రేశ్ యాదవ్, మహిపాల్ రెడ్డి , నర్సింహులు యాదవ్, శంకర్‌ముదిరాజ్, నాయకులు శ్రీనివాస్ రెడ్డి, శ్రీనివాస్ యాదవ్, మణికంఠ గౌడ్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి


మహాసభలో అభివాదం చేస్తున్న నాయకులు

సంక్షేమ బోర్డు పరిరక్షణకు ఉద్యమించాలి

కడ్తాల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు పరిరక్షణకు కార్మికులు ఉద్యమించాలని భవన నిర్మాణ కార్మిక సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్‌రావు పిలుపునిచ్చారు. కడ్తాలలో సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో మండల భవన నిర్మాణ కార్మికుల మహాసభ నిర్వహించారు. మండల అధ్యక్షుడు పెంటయ్య అధ్యక్షత వహించారు. రామ్మోహన్‌రావు, సీఐటీయూ జిల్లా నాయకుడు జగన్, సంఘం నాయకులు పార్వతి, జహంగీర్ హాజరయ్యారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై భవిష్యత్తు కార్యాచరణ రూపొందించారు. వెల్ఫేర్ బోర్డును ప్రైవేట్‌కు అప్పజెప్పే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని అన్నారు. కార్మిక హక్కుల కోసం పోరాటాలు సాగిస్తామని పేర్కొన్నారు. అనంతరం భవన నిర్మాణ కార్మికుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెంటయ్య, ప్రధానకార్యదర్శి మహేశ్,ఉపాధ్యక్షులు బాల్‌రాజ్, కొండల్, సత్యంగౌడ్, కార్యదర్శులు అర్జున్, సిలారి, జంగయ్య, కోశాధికారి యాదగిరి, సభ్యులుగా వీరేశ్, జంగయ్య, అంజయ్య, సత్యం, మహేశ్, కృష్ణయ్య, మల్లేశ్, దుర్గయ్య, శివయ్య, జంగయ్య ఎన్నికయ్యారు.



విద్యార్థులకు డిక్షనరీలు అందజేస్తున్న భట్టు కిషన్ రెడ్డి

విద్యతోనే ఉన్నత జీవితం

ఆమనగల్లు, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): విద్యతోనే ఉన్నత జీవితం, సమాజంలో గౌరవం లభిస్తాయని ఆమనగల్లు మార్కెట్ మాజీ చైర్మన్ భట్టు కిషన్‌రెడ్డి అన్నారు. కలకొండ జెడ్పీ పాఠశాల విద్యార్థులకు పులి కృష్ణ సొంత డబ్బులతో ఇంగ్లీష్ క్లాసులు ఆన్‌లైన్‌లో బోధిస్తున్నాడు. కృష్ణ సమకూర్చిన డిక్షనరీలను సోమవారం కిషన్‌రెడ్డి అందజేసి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు పెట్టపీట వేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, ఓంప్రకాశ్‌రెడ్డి, లక్ష్మీనర్సింహా రెడ్డి, యాదయ్య, రాములు, జైపాల్, సతీష్, సందీప్‌రెడ్డి, కొండల్, శ్రీను, మొయినుద్దీన్,తానేశ్, యాదగిరి, ఈశ్వరయ్య, సైదులు, మాసయ్య, చెన్నయ్య, వెంకటేశ్, నాగేశ్, మహేశ్ పాల్గొన్నారు.



క్యాద్గీరా శివారులో ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

పంట నష్టాన్ని పట్టించుకోరా?

బషీరాబాద్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలతో కాగ్నానది వరద నీటి ముంపునకు గురై పత్తి, కంది పంటలు పాడైపోయాయి. రోజుల తరబడి నీటిలో పంట మునిగి కుళ్లిపోతున్నా వ్యవసాయాధికారులు ఇటు వైపు కన్నెత్తి చూడటంలేదని మండలంలోని క్యాద్గీరా రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. గ్రామ శివారులోని కాగ్నానది ఉప్పొంగి ప్రవహించడంతో 20 ఎకరాలకు పైగా పలు పంటలు నీట మునిగి తీవ్రంగా నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. వారం రోజులు గడుస్తున్నా ఆ శాఖ అధికారులు తమ గ్రామానికి రాలేదని వాపోయారు. ఈ విషయమై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఇప్పటికైనా వ్యవసాయాధికారులు స్పందించి పంటనష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వం పరిహారం అందించేలా చూడాలని బాధిత రైతులు కోరుతున్నారు.



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న నవీన్‌రెడ్డి

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా అవసరాలకు అనుగుణంగా మేడ్చల్ మున్సిపల్ పరిధిలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు రాష్ట్ర బేవరేజెస్ త్రిసభ్యకమిటీ సభ్యుడు నవీన్ రెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులోని వికర్ సెక్షన్, అర్చన కాలనీల్లో సీసీరోడ్డు పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. కిష్టాపూర్‌లోని వికర్‌సెక్షన్ కాలనీ, అర్చన కాలనీలతో పాటు వర్షాల కారణంగా దెబ్బతిన్న ఇతర కాలనీల్లో రోడ్లు వేస్తున్నట్లు తెలిపారు. మేడ్చల్‌లో సీసీరోడ్లు, అంతర్గత డ్రైనేజీ లైన్ల ఏర్పాటుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు కాంగ్రెస్ మేడ్చల్ పట్టణ అధ్యక్షుడు వేముల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



పంచాయతీలో సమావేశమైన యూపీ అధికారులు, సర్పంచులు

అభివృద్ధి పనులు భేష్

● మాల్‌లో పర్యటించిన ఉత్తర్‌ప్రదేశ్ అధికారులు, సర్పంచ్‌లు

యాచారం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాల్‌లో ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన 21 మంది సర్పంచ్‌లు, 9 మంది అధికారులు సోమవారం పర్యటించారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను పరిశీలించారు. గ్రామానికి కేంద్ర ప్రభుత్వ ఆత్మ నిర్భర్ పంచాయతీ అవార్డు వచ్చింది. పశువుల సంత ద్వారా పంచాయతీకి ఆదాయం వస్తుందని ఎంపీడీవో రాధారాణి, ఎంపీవో శ్రీలత వారికి వివరించారు. నర్సరీ, శ్మశాన వాటిక తదితర పనులను పరిశీలించారు. వసూలయ్యే పన్నులను గ్రామాభివృద్ధికి ఖర్చుచేయడం బాగుందన్నారు. యూజీడీ, సీసీ రోడ్లు బాగున్నాయని సర్పంచ్‌లు తెలిపారు. కార్యక్రమంలో అధికారులు స్మిత, అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి వైవీ రాజు ఉన్నారు.

పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

» ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్



మాట్లాడుతున్న వేణుగోపాల్

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్‌ను రద్దుచేసి పాతపెన్షన్ విధానాన్ని వెంటనే పునరుద్ధరించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాల ఆధ్వర్యంలో సోమవారం పెన్షన్ విద్రోహ దినాన్ని పాటిస్తూ కలెక్టరేట్ వద్ద ఉదయం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ విధానాన్ని ప్రవేశపెట్టి పాత పెన్షన్ తొలగించడం ద్వారా ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కులను ప్రభుత్వాలు కాలరాశాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో రెండు లక్షల పైబడి ఉద్యోగులు ఐక్యతను చాటుతూ నిరసనలో పాల్గొన్నారని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగ విరమణ తర్వాత భద్రతగా నిలిచే పెన్షన్ లేకపోవడం తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పాత పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ షఫి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న వైర్లను తొలగించాలి



ఏఈ ప్రదీప్‌కు వినతిపత్రం ఇస్తున్న నరేష్‌కుమార్

శంకర్‌పల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): ప్రమాదకరంగా ఉన్న పాత విద్యుత్ వైర్లను తొలగించి కొత్త వాటిని బిగించాలని శంకర్‌పల్లి సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు నరేష్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఏఈ ప్రదీప్‌కు, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్‌లకు సోమవారం వినతిపత్రాలను అందజేశారు. ఇండ్లకు, వీధిదీపాలకు విద్యుత్ సరఫరా చేసే వైర్లు ప్రమాదకరంగా మారాయన్నారు. పాత వైర్లు తరచూ తెగుతున్నాయని తెలిపారు. లోఓల్టేజీ సమస్య తీర్చేందుకు అదనపు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రవీందర్ యాదవ్, మహేందర్‌రెడ్డి, వైభవ్ ఉన్నారు.

బాల్‌రాజ్ కుటుంబానికి న్యాయం చేయాలి

ముగిసిన అంత్యక్రియలు



దండుమైలారంలో ఆందోళన చేస్తున్న బాల్‌రాజ్ కుటుంబీకులు, బంధువులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని దండుమైలారంలో పొలం వివాదంలో దాయాదుల దాడిలో చనిపోయిన గుడేటి బాల్‌రాజ్ కుటుంబానికి న్యాయం చేయాలని సోమవారం గ్రామంలో అతడి కుటుంబ సభ్యులు, బంధువులు బైఠాయించారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్‌రెడ్డిలు పరిస్థితిని అదుపు చేశారు. బాల్‌రాజ్‌కు భార్య పావని, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. దాడిలో పావని సైతం తీవ్రంగా గాయపడింది. అదే సమయంలో రెండు వర్గాల తరఫు పెద్దమనుషులు చర్చించి మృతుడి కుటుంబానికి రెండెకరాల పొలం ఇచ్చేందుకు ఒప్పందం కుదిర్చినట్టు తెలుస్తోంది. పోస్టుమార్టం అనంతరం సోమవారం సాయంత్రం బాల్‌రాజ్ మృతదేహాన్ని గ్రామానికి తెచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. గాయపడిన బాల్‌రాజ్ తమ్ముడు పర్వతాలు భార్య మంజులకు బైరామల్‌గూడ అవేర్ గ్లోబల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలిసింది. కాగా ఈ దాడులను ప్రోత్సహించిన ఆదిబట్లకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడిపైనా కేసు నమోదు చేయాలని బాల్‌రాజ్ బంధువులు డిమాండ్ చేశారు. ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా గ్రామంలో పికెటింగ్ కొనసాగుతోంది.

కేబుళ్ల తొలగింపుతో ఇక్కట్లు

ఘట్‌కేసర్‌లో నిలిచిన ఇంటర్నెట్ సేవలు

» ప్రభుత్వ కార్యాలయాల్లో పనులకు అంతరాయం

» వర్క్‌ఫ్రమ్ హోం ఉద్యోగులకూ తీవ్ర అవస్థలు



ఎదులాబాద్ రోడ్డులో కేబుల్ వైర్లను తొలగిస్తున్న విద్యుత్ సిబ్బంది

ఘట్‌కేసర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ స్తంభాలకు ఏర్పాటు చేసిన అక్రమ ఇంటర్నెట్ కేబుళ్లను విద్యుత్ అధికారులు తొలగింపునకు శ్రీకారం చుట్టారు. దీంతో ఘట్‌కేసర్‌లో ఇంటర్నెట్ సేవలు స్తంభించాయి. మున్సిపాలిటీ పరిధిలోని వివిధ రోడ్లకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలకు పెద్దఎత్తున ఇంటర్నెట్ కేబుళ్లను ఏర్పాటు చేశారు. ఇటీవల నగరంలో జరిగిన విద్యుత్ ప్రమాదం, వినాయక విగ్రహాల తరలింపు, నిమజ్జనాల తరలింపును దృష్టిలో పెట్టుకుని తగు చర్యలు తీసుకుంటున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. ఘట్‌కేసర్‌లోని ఒక్క ఎదులాబాద్ రోడ్డులోనే భారీగా కేబుల్ వైర్లను కత్తిరించి రోడ్లపక్కన పడేశారు. అనంతరం తొలగించిన కేబుల్ వైర్లను డీసీఎం వాహనంలో వేసి విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తరలించారు. అనేక సంవత్సరాలుగా కేబుల్ ఆపరేటర్లు విద్యుత్ స్తంభాలకు పెద్దఎత్తున వివిధ రకాల కేబుళ్లను ఏర్పాటు చేశారు. కొన్ని సందర్భాల్లో విత్యుత్ తీగలు సరిచేయడానికి సైతం ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడింది. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎదులాబాద్ రోడ్డులో విద్యుత్ అధికారులు చేపట్టిన కేబుల్ వైర్ల తొలగింపుతో ఇంటర్‌నెట్ సేవలు నిలిచిపోయాయి. ప్రధానంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పనులు ముందుకు సాగక జనాలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. వినియోగ దారులనుంచి పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తుండటంతో కేబుల్ ఆపరేటర్లు ముసురు వర్షంలోనూ కొత్తకేబుళ్లను ఏర్పాటుచేసి ఇంటర్నెట్‌ను పునరుద్ధరించే పనుల్లో నిమగ్నమయ్యారు. పెద్దఎత్తున కేబుల్ వైర్లు తొలగించడంతో ఇంటర్నెట్ సేవలు ప్రారంభం కావడానికి ఎన్ని రోజుల సమయం పడుతుందో తెలయని అయోమయ పరిస్థితి నెలకొన్నది.

వర్క్‌ఫ్రమ్ హోం ఇబ్బందికరంగా మారింది



ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని మారుతినగర్, శ్రీనిధి కాలనీతోపాటు కాలనీలో వారం రోజులుగా ఇంటర్నెట్ సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వర్క్‌ఫ్రంహోం చేయడానికి ఇబ్బంది పడాల్సివస్తుంది. ఈవిషయమై ఇంటర్నెట్ సంస్థ నిర్వాహకులను అడిగితే సమాధానం చెప్పడంలేదు.

- ఎంబీఆర్ రాజు, ప్రైవేట్ ఉద్యోగి, ఘట్‌కేసర్

మూడు రోజులుగా నెట్ రావడంలేదు



ఘట్‌కేసర్‌లో గత మూడురోజులుగా ఇంటర్నెట్ రావడంలేదు. దీంతో ఎలాంటిపని చేయలేకపోతున్నాం. ప్రస్తుతం అన్ని సేవలు ఇంటర్నెట్‌పై ఆధారపడి ఉన్నాయి. జనాలు వచ్చి వెనుదిరిగి వెళ్తున్నారు. అసలే అంతంత మాత్రంగా సాగుతున్న వ్యాపారాలపై నెట్‌సేవలు నిలిచిపోవడంతో ఏం చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది.

- వాకిటి ప్రవీణ్‌రెడ్డి, ఇంటర్నెట్ దుకాణదారుడు, ఘట్‌కేసర్



పనిచేయని వెదర్ రిపోర్ట్ డిస్‌ప్లే

వికారాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో అందరికి కనిపించేలా ఏర్పాటు చేసిన వెదర్ రిపోర్ట్ (వాతావరణ సమాచారం) డిస్‌ప్లే గత కొన్ని రోజులుగా పని చేయడం లేదు. జిల్లాలో వివిధ ప్రాంతాల్లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు, వర్షపాతం వివరాలు తెలియజేసే ఈ డిజిటల్ బోర్డు మొక్కుబడిగా మారడం కలెక్టరేట్‌లో చర్చనీయాంశంగా మారింది.

కల్వర్టుపై గుంతల పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కల్వర్టుపై గుంతలను పూడ్చివేయించిన అధికారులు

దుద్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): 'గుంతలతో ఇబ్బందులు' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండలంలోని హకీంపేట్ గ్రామ శివారులో కోస్గి పట్టణానికి వెళ్లే మార్గంలో కల్వర్టుపై గుంతలు ఏర్పడి వాహనదారులు ఎదుర్కొంటున్నారు. స్పందించిన అధికారులు కల్వర్టుపై ఏర్పడిన గుంతలను కంకర, డస్టుతో సోమవారం పూడ్చివేయించారు.

రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు



చిన్న ఎల్కిచర్లకు ఆర్టీసీ సేవలను ప్రారంభించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

చౌదరిగూడ, కొందుర్గు,సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): వర్షాలకు దెబ్బతిన్న షాద్‌నగర్-లాల్‌పహాడ్ చౌరస్తా ఆర్‌అండ్‌బీ బీటీ రోడ్డు మరమ్మతులకు రూ.60లక్షలు మంజూరైనట్లు కొందుర్గు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం కొందుర్గులో రోడ్డు పనులను ఆర్‌అండ్‌బీ ఏఈ రాజశేఖర్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే శ్రీరంగాపూర్-చిన్న ఎల్కిచర్ల రూట్ ఆర్టీసీ సర్వీసును షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ షాద్‌నగర్ ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పురుషోత్తం రెడ్డి, కృష్ణయ్య, మంగులాల్‌నాయక్, రాములుగౌడ్, వేణుగోపాల్, రవి, విక్రం, కాంట్రాక్టర్ షాబాజ్, పంచాయతీ కార్యదర్శి సురేఖ పాల్గొన్నారు.

బాబు బాగుండాలని బక్కని పూజలు



పూజలు చేస్తున్న బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆయురారోగ్యాలతో ఉండాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు కోరారు. ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు పదవీ బాధ్యతలు చేపట్టి 30సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకొని సోమవారం ఫరూఖ్‌నగర్ మండలంలోని రామేశ్వరాలయంలో రామలింగేశ్వరుడికి అభిషేకపూజలు చేశారు. చంద్రబాబునాయుడు నిండునూరేళ్ల ప్రజా జీవితంలో కొనసాగాలని నర్సింహులు ప్రార్థించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గంధం ఆనంద్, కుమార్, ఎ.లక్ష్మయ్య, కె.అంజయ్య, భూపతిరెడ్డి, ఎస్.వెంకటయ్య, రాజ్ పాల్గొన్నారు.

అసైన్డ్ రైతుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

ఇబ్రహీంపట్నం, సెప్టెంబరు1(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం అనాజ్‌పూర్‌లో అసైన్డ్ పట్టాలు పొందిన రైతుల పేర్లను భూ భారతి పోర్టల్‌లో నమోదుచేసి పట్టా పాసుపుస్తకాలు ఇవ్వాలని సీపీఎం ఆధ్వర్యంలో రైతులు సోమవారం ఇబ్రహీంపట్నం ఆర్డీవో కార్యాలయాన్ని ముట్టడించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, మండల కార్యదర్శి ఏర్పుల నర్సింహ మాట్లాడుతూ.. అనాజ్‌పూర్‌లో సర్వే నంబర్లు 274, 275, 277, 278, 281లలో 125ఎకరాల్లో 1991లో 125మంది పేదలకు ఎకరా చొప్పున పంచారని గుర్తు చేశారు. 80మందికి పాసు పుస్తకాలిచ్చారని, ధరణిలో రైతుల పేర్లను తొలగించారని వాపోయారు. అప్పటి నుంచి రైతులకు ప్రభుత్వ పథకాలు అందడం లేదన్నారు. ఆందోళనలో సీపీఎం నాయకులు సామేల్, జంగయ్య, సుమలత, శివకుమార్, ముత్యాలు, బాల్‌రాజ్, రైతులు పాల్గొన్నారు.

టీచర్ల డిప్యూటేషన్‌ను రద్దు చేయండి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

యాచారం, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): తమ గ్రామ స్కూల్ టీచర్లను ఇతర ప్రాంతాలకు డిప్యూట్ చేయొద్దని, డిప్యూటేషన్లను రద్దు చేయాలని కోరుతూ సోమవారం మేడిపల్లి మాజీసర్పంచ్ బోడ కృష్ణ, పీఆర్‌జీ గ్రూప్ చైర్మన్ పి.రవీందర్‌గుప్తా తదితరులు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. ఉపాధ్యాయులు లేక బోధన జరగక విద్యార్థులు నష్టపోతున్నారన్నారు. రెండు రోజుల్లో డిప్యూటేషన్‌ను రద్దు చేయాలని కోరారు. విద్యార్థులకు న్యాయం చేయకుంటే యాచారం, కలెక్టరేట్‌ల వద్ద ధర్నా చేస్తామన్నారు. కాగా మీకు న్యాయం చేసి ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి గ్రామస్తులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నరేష్, శ్రీశైలం, శ్రీను., ఖాదర్, నాగరాజు తదితరులున్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దు

ఆదిభట్ల : ఇబ్రహీంపట్నం నుంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించొద్దని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మెట్టు దామోదర్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టర్ నారాయణరెడ్డికి టీడీపీ నాయకులు వినతిపత్రం ఇచ్చారు. ప్రభుత్వం సమీకృత సబ్‌రిస్ట్రార్ కార్యాలయాల పేరిట పట్నం రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మంకాల్‌కు తరలించాలని తలపెట్టిందని కలెక్టర్‌కు తెలిపారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇక్కడి నుంచి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలిస్తే మంచాల, యాచారం, మాల్, లోయపల్లి తదితర మండలాల ప్రజలాకు ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. ప్రభుత్వం నిర్ణయంపై పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో జె.రవీందర్, రంగారెడ్డి, రాంరెడ్డి, వీరేశం, లతీఫ్, హర్షవర్ధన్, వెంకటేష్, వెంకట్‌రెడ్డి, బుచ్చయ్య పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు

» వృద్ధురాలిని కుటుంబీకులకు అప్పగింత

తలకొండపల్లి, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి): పోలీసులు మానవత్వాన్ని చాటారు. ఓ వృద్ధురాలిని చేరదీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. తలకొండపల్లి ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు.. తలకొండపల్లిలోని ఏపీజీవీబీ బ్యాంక్ వద్ద ఓ వృద్ధురాలు మానసిక స్థితి సరిగాలేక పడిపోయింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ సిబ్బందిని అక్కడికి పంపారు. కానిస్టేబుల్ నిరంజన్ వృద్ధురాలి ఆధార్ కార్డు ఆధారంగా ఆమె మిడ్జిల్‌కు చెందిన మారెమ్మగా గుర్తించారు. వెంటనే ఆమెను ఇంటికి తీసుకుపోయి అప్పగించారు.



వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసు

సీపీఎస్ రద్దుకు ఉద్యోగ సంఘాల నిరసన



మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉద్యోగులు

మేడ్చల్, సెప్టెంబరు 1(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మేడ్చల్ కలెక్టరేట్ ఎదుట ఉద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగ సంఘాల నేతలు మాట్లాడుతూ సీపీఎస్ ఉద్యోగులకు ఉరితాడుగా మారిందన్నారు. ఇప్పటికైనా వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్‌ను రద్దు చేయాలని కోరారు. సీపీఎస్ రద్దు చేసేంతవరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు ఉద్యోగ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఇళ్లలోకి వరద నీరు వస్తోందని మహిళల ఆందోళన


పంచాయతీరాజ్ ఏఈ నందినిరెడ్డితో సమస్యను వివరిస్తున్న మహిళలు

తాండూరు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కల్వర్టు నిర్మాణంతో ఇళ్లలోకి వరద నీరు వస్తోందని మహిళలు ఆందోళన వ్యక్తం చేశారు. మండలంలోని సిరిగిరిపేట గ్రామ శివారు నుంచి సంకిరెడ్డిపల్లికి నిర్మిస్తున్న లింకు రోడ్డులో భాగంగా సిరిగిరిపేట్ గ్రామ సమీపంలో నిర్మించిన కల్వర్టు వద్ద సిమెంట్ రోడ్డును నిర్మించడంతో వరద నీరు, మురుగు నీరు ఇళ్లలోకి వస్తుందని గ్రామ మహిళలు తదితరులు పంచాయతీరాజ్ ఏఈ నందినిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై ఏఈ నందినిరెడ్డిని వివరణ కోరగా కల్వర్టు వద్ద ఉన్న లోతైన ప్రాంతాన్ని పూడ్చివేస్తే వరద నీరు ఇళ్లలోకి రాదన్నారు.

కొత్తపల్లిలో తాగునీటికి ఇబ్బందులు


తాగునీటి ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న గ్రామస్తులు

చౌడాపూర్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి గ్రామంలో తాగునీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ తాగునీటి సక్రమంగా సరఫరా కాకపోవడంతో రెండు, మూడు నెలలుగా ఇబ్బందులు తప్పడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. దీంతో రైతుల వ్యవసాయ పొలాలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారరు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించాలని కోరారు.

ఓపీఎస్‌తోనే ఉద్యోగులకు ఆర్థిక భద్రత


నందకుమార్

వికారాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ఓపీఎస్‌తోనే ఉద్యోగులకు ఆర్థిక భద్రత అని పంచాయతీరాజ్ మినిస్ట్రీరియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల నందకుమార్ అన్నారు. సీపీఎస్ రద్దు పోరాటానికి తమ సంఘం సంపూర్ణ మద్దతు ఇస్తోందని ఆయన సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెన్షన్ అనేది ఉద్యోగుల హక్కు అని, అది దానం కాదన్నారు. బిక్ష అంతకంటే కాదని తెలిపారు. ఉద్యోగ విరమణ తర్వాత కనీస భరోసా లేకుండా జీవనోపాధి పోరాటం చేయాల్సిన పరిస్థితులు అత్యంత అన్యాయమఅన్నారు. 2004 ఏప్రిల్ ఒకటో తేదీ తర్వాత ప్రభుత్వ ఉద్యోగాల్లో చేరిన వారంతా సీపీఎస్‌లోకి రావడంతో ఆ ఉద్యోగుల భవిష్యత్తు పూర్తిగా అనిశ్చితిలో పడిపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఓపీఎస్ అమలు చేస్తుండగా, మరికొన్ని రాష్ట్రాల్లో పునరుద్ధరణ దిశగా చర్యలు తీసుకుంటున్నా తెలుగు రాష్ట్రాల్లో మాత్రం సీపీఎస్ కొనసాగిస్తూనే ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మానవీయ కోణంలో ఆలోచించి వెంటనే సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరు నెలలుగా జీతాలు రావడంలేదు

తాండూరు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తమకు ఆరు నెలలుగా జీతాలు అందడంలేదని మోడల్ స్కూల్‌లోని ఔట్‌సోర్సింగ్ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. మోడల్‌స్కూల్‌లో పనిచేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్లు, ఫిజికల్ డైరెక్టర్లు, అటెండర్లు, వాచ్‌మెన్లు కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ట్రాన్స్‌పోర్ట్ ఖర్చులు కూడా భరించలేని స్థితిరావడంతో రాష్ట్ర వ్యాప్తంగా మోడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్ సిబ్బంది సెప్టెంబర్ 1 నుంచి జీతాలు అందేవరకు స్కూల్‌కి హాజరు కాకుండా నిరసన తెలుపాలని నిర్ణయించారు.

'మహాగర్జన'ను విజయవంతం చేయాలి

యాలాల/తాండూరు రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): సెప్టెంబరు 9వ తేదీన హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించే మహాగర్జన సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మెట్లీ సూర్యప్రకాశ్ పిలుపునిచ్చారు. దేవనూర్‌లో సోమవారం గ్రామంలోని పెన్షన్‌దారులతో సమావేశం నిర్వహించారు. దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళల పెన్షన్లు వెంటనే పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవనూర్ గ్రామ పెన్షన్ దారులు పాల్గొన్నారు. అదేవిధంగా తాండూరు మండలంలోని చెంగోల్‌లో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గట్టగల ప్రశాంత్ మాదిగ, తాండూరు మండల ఇన్‌చార్జి నర్సిములు మాదిగ చేయూత పెన్షన్ దారులతో సమావేశం నిర్వహించారు.

పూర్వ ప్రాథమిక పాఠశాలలు ఎంపిక

మోమిన్‌పేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మూడు పాఠశాలలు పూర్వ ప్రాథమిక పాఠశాలలకు ఎంపికైనట్లు ఎంఈవో మల్లేశం తెలిపారు. ఆయన సోమవారం మాట్లాడుతూ మండలంలోని ఎన్కెపల్లి, చక్రంపల్లి, లచ్చనాయక్ తండా గ్రామాల్లో పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థులకు బోధించేందుకు ఉపాధ్యాయులు, ఆయాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియేట్ ఉత్తీర్ణతతో పాటు ఏదైనా నైపుణ్యం ఉంటే సంబంధిత ఆధారాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆయాలకు సంబంధించి మహిళలు 7వ తరగతి పాసైన వారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

పాఠశాలలు.. సర్వతోముఖాభివృద్ధికి సోపానాలు

వికారాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పాఠశాలలు విద్య, జ్ఞానం పొందడానికి మాత్రమే కాకుండా వ్యక్తిత్వ నిర్మాణం, స్వీయాభివృద్ధి, సమాజసేవకు సాధనంగా ఉపయోగించుకోవాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు, జైదుపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్ఎం కొత్తగడి అంజిరెడ్డి అన్నారు. ఏబీఆర్ఎస్ఎం ఆధ్వర్యంలో సోమవారం దేశ వ్యాప్తంగా ఐదు లక్షల పాఠశాలల్లో మన పాఠశాల-మన ఆత్మగౌరవం పేరుతో విద్యార్థులతో ప్రతిజ్ఞ నిర్వహించగా జైదుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఆయన విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సంతోష్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

బషీరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యంపై ప్రత్యేకదృష్టి సారించాలని బషీరాబాద్ ఎంపీవో విజయ్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మర్పల్లి, ఇస్మాయిల్‌పూర్ గ్రామ పంచాయతీల్లో సోమవారం ఆయన పర్యటించారు. గ్రామపంచాయతీల్లోని పలువార్డులను కలియతిరిగారు. వర్షాల దృష్ట్యా పరిశుభ్రతకు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని కార్యదర్శులు సంజీవకుమార్, మయూరిలను ఆదేశించారు. గ్రామ పంచాయతీల వివిధ రికార్డులను పరిశీలించారు.

ట్యాంకు ఇలా.. నీళ్లు తాగేదెలా?


పోలెపల్లిలో అపరిశుభ్రంగా ట్యాంకు

దుద్యాల, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పోలెపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని మొదటి వార్డులో ఉన్న తాగునీటి ట్యాంకు దగ్గర అపరిశుభ్రంగా మారింది. దీంతో నీళ్లు పట్టుకునేందుకు వెళ్తున్న ప్రజలు ఎప్పుడు జారిపడతామోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చాలా గ్రామాల్లో తాగునీటి ట్యాంకుల చుట్టూ మురుగు నీరు నిలిచి, అపరిశుభ్రత నెలకొంది. ఫలితంగా స్థానికులు నీరు పట్టుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

క్రీడా ప్రాంగణంలో కంకర డంప్


క్రీడా ప్రాంగణంలో డంప్ చేసిన కంకర

కొడంగల్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): చిత్రంలో కనిపిస్తున్నది క్రషింగ్ మిషన్ దగ్గర ఉన్న కంకర్ స్టాక్ అనుకుంటే పొరపాటే. నియోజకవర్గంలోని దౌల్తాబాద్ మండలం నీటూర్ గ్రామ శివారులో గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణం ఇది. రోడ్డు కాంట్రాక్టర్ క్రషింగ్ మిషన్‌ల దగ్గరి నుంచి టిప్పర్ల ద్వారా తీసుకవచ్చిన కంకరను ఇలా క్రీడా ప్రాంగణం స్థలంలో డంప్ చేశారు.

గణనాథుడికి నిత్య పూజలు

వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో గణనాథుడు నిత్య పూజలందుకుంటున్నాడు. ఈ సందర్భంగా సోమవారం పలు మండపాల్లో ప్రత్యేకపూజలు చేశారు. పలు వినాయక మండపాల్లో లడ్డూ వేలం నిర్వహించారు. అధికారులు నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.


ఘట్‌కేసర్: వీకర్ సెక్షన్ కాలనీలోని గణపతి హోమంలో భక్తులు


ధారూరు: గ్రామ పంచాయతీ వినాయకుడి లడ్డూను రూ.72వేలకు దక్కించుకున్న మల్లేశం →


ఘట్‌కేసర్: గణనాథున్ని దర్శించుకుంటున్న సీఐలు బాలస్వామి, రాజువర్మ


పరిగి: లక్నాపూర్ ప్రాజెక్టులో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ కమిషనర్ వెంకటయ్య


పరిగిలోని బోయవాడలో ప్రతిష్ఠించిన గణేశుడి పూజలు

తప్పని యూరియా పాట్లు

(ఐదో పేజీ తరువాయి)

స్వల్పంగా గాయాలయ్యాయి. వెంటనే అతడిని కుటుంబ సభ్యులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్యం అందించారు. ఇంతలో పోలీసులు అక్కడికి చేరుకుని రైతులందరినీ క్యూలో నిల్చోబెట్టారు. ఒక్కో రైతుకు ఒక బస్తా చీటిరాసి యూరియా అందజేశారు. కాగా, యూరియా దొరకని రైతులు ఆందోళనకు దిగారు. ప్రభుత్వంపై తిట్లపురాణం అందుకున్నారు.

టోకెన్ల ద్వారా యూరియా సరఫరా

ధారూరు సొసైటీ కార్యాలయానికి వచ్చిన రైతులు యూరియా కోసం ఎగబడ్డారు. సొసైటీ కార్యాలయం ఆవరణలో పెద్ద ఎత్తున గుమిగూడటంతో గందరగోళం నెలకొంది. రైతులను క్రమపద్ధతిలో పిలిచి యూరియాను సరఫరా చేసేందుకు సొసైటీ సిబ్బంది రైతుల నుంచి ఆధార్‌కార్డు జిరాక్సులను సేకరిస్తుండగా గందరగోళం నెలకొంది. ముందుగా వచ్చిన రైతుల ఆధార్ కార్డు జిరాక్సులు ముందుగా తీసుకోవాలని ఆందోళనకు దిగారు. అనంతరం ఒక్కో రైతుకు ఐదు బస్తాల చొప్పున యూరియా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేయటంతో సిబ్బంది జిరాక్సులను తీసుకోవటం నిలిపివేసి కౌంటర్ మూసివేశారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని ఒక్కో రైతుకు రెండు బస్తాల చొప్పున యూరియా తీసుకునేలా నచ్చ చెప్పి రైతులను ఒప్పించారు. ఆ తర్వాత రైతులకు టోకెన్ నంబర్లు జారీ చేసి యూరియాను సరఫరా చేశారు. కాగా సొసైటీకి సరఫరా అయిన 450 బస్తాల యూరియాను సోమవారం సాయంత్రం వరకు రైతులకు పంపిణీ చేశారు. అలాగే మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని సొసైటీ వద్ద రైతులు చెప్పులను క్యూలైన్‌లో పెట్టి యూరియా బస్తాల కోసం నిలబడ్డారు. ఇలాంటి పరిస్థితి గతంలో ఎప్పుడూ చూడ లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, అధికారులు రైతులకు యూరియా సరఫరాలో ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.


మోమిన్‌పేట్‌లో యూరియా కోసం లైన్‌లో చెప్పులు పెట్టిన రైతులు

విష జ్వరాల పంజా

(ఐదో పేజీ తరువాయి)

చిన్నారుల సంఖ్య పెరుగుతోంది. ఈ నేపథ్యంలో జిల్లా ఆస్పత్రిలో ఉన్న బెడ్లు రోగులకు సరిపోని పరిస్థితి నెలకొంది.

ముమ్మరంగా పారిశుధ్య కార్యక్రమాలు

విష జ్వరాలు వ్యాపిస్తున్న నేపథ్యంలో తాండూరు, వికారాబాద్ మున్సిపాలిటీలను రిస్క్ ఏరియాలుగా గుర్తించారు. ప్రధానంగా స్లమ్ ఏరియాల్లో పారిశుధ్యంపై అధికారులు చర్యలు చేపట్టారు. వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపాలిటీలు సమన్వయంతో ప్రణాళికలు సిద్ధం చేసుకొని ఉంటే వైరల్ ఫీవర్లు వ్యాప్తి చెందేవి కావని స్థానికులు ఆరోపిస్తున్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయడం లేదన్నారు. కేసులు ఎక్కువ నమోదు అవుతుండడంతో మూలనపడ్డ ఫాగింగ్ మిషన్లకు మరమ్మతులు చేసి అందుబాటులో తెచ్చారు. మున్సిపాలిటీలోని ప్రైవేటు ప్లాట్లలో మురుగు నీటి నిల్వలు ఉండకుండా చూడాల్సిన అవసరం ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలని. తాండూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి ఎదుటనే డ్రైనేజీ పొంగిపొర్లి మురుగు నీరు ప్రధాన రోడ్డుపై ప్రవహిస్తున్నది. ఈ నీటిని దారి మళ్లించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు


వ్యవసాయ సహకార సంఘం సీఈవో బ్రహ్మంను సన్మానిస్తున్న చైర్మన్ రాంచంద్రారెడ్డి

బంట్వారం, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ రాంచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో సోమవారం వ్యవసాయ సహకార సంఘం సీఈవో బ్రహ్మం పదవీ విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు కార్యక్రమంలో రాంచంద్రారెడ్డి మాట్లాడారు. బ్రహ్మం తన పదవీకాలంలో సంఘ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని తెలిపారు. రైతుల సమస్యలను అర్థం చేసుకొని వెంటనే పరిష్కారం చూపడంలో ఎల్లప్పుడూ ముందుండేవారన్నారు. సిబ్బందిని సానుకూల దృక్పథంతో నడిపించడమే కాకుండా రైతులకు ఎల్లప్పుడూ అండగా నిలిచారని తెలిపారు. సంఘాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడంలో ఆయన పాత్ర మరువలేనిదన్నారు. బ్రహ్మం సేవలను గుర్తుచేసుకుంటూ పలువురు డైరెక్టర్లు, సిబ్బంది తమ అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ సుధాకర్‌గౌడ్, డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, రాధాకృష్ణ, సిబ్బంది శ్రీనివాస్, నరేందర్, నాయకులు నర్సిములు, ప్రభాకర్ యాదవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

రుణాలను రెన్యూవల్ చేసుకోవాలి

రైతులు తప్పనిసరిగా స్వల్పకాలిక రుణాలను సకాలంలో రెన్యూవల్ చేసుకోవాలని వ్యవసాయ బంట్వారం సహకారం సంఘం చైర్మన్ రాంచంద్రారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో సోమవారంసర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీర్ఘకాలిక రుణాలను నిర్ణీత గడువులోపు చెల్లించడం ద్వారా రైతులకు రిబేట్ వస్తుందన్నారు. చిన్నచిన్న అవసరాల కోసం అధిక వడ్డీతో ప్రైవేట్ బ్యాంకులకు వెళ్లకుండా ఈ వ్యవసాయ సహకార సంఘం బ్యాంకులో తీసుకోవాలన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సౌకర్యాలను రైతులకు అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీవో నాగార్జున, జేఆర్ రామకృష్ణ, షైమూద్, కిరణ్మయి, రవి నారాయణరెడ్డి, వైస్‌చైర్మన్ సుధాకర్‌గౌడ్, డైరెక్టర్లు సుదర్శన్‌రెడ్డి, రాధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

కులకచర్ల: మండల కేంద్రంలో ద్విచక్రవాహనదారులకు సోమవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. పోలీసులు ఖాజా, శేఖర్, ఆంజనేయులు, ద్విచక్రవాహనదారులు పాల్గొన్నారు.

డిప్యూటీ తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

దౌల్తాబాద్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా వెంకటాచారి సోమవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన చాంద్‌పాష బొంరాస్‌పేట్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో పూడూరు నుంచి వచ్చిన వెంకటాచారి బాధ్యతలు చేపట్టారు.

మాజీ ఎంపీపీకి చీఫ్‌విప్ పరామర్శ

యాలాల: యాలాల మాజీ ఎంపీపీ బాలేశ్వర్ గుప్తా తల్లి తాళ్లపల్లి సరోజనమ్మ సోమవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి టీపీసీసీ రాష్ట్ర ప్రచార సమన్వయకర్త కరణం పురుషోత్తంరావు, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్‌తో కలిసి బాలేశ్వర్‌గుప్తా ఇంటికి వెళ్లి పరామర్శించారు. అదేవిధంగా మాజీ ఎంపీపీ తల్లి మృతి చెందిన విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు.

బీసీ రిజర్వేషన్‌కు ఆమోదం హర్షణీయం

దోమ: బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు అసెంబ్లీలో కాంగ్రెస్ ప్రభుత్వం తీర్మానంతో ఆమోదం తెలపడం హర్షణీయమని ఉదన్‌రావుపల్లి కాంగ్రెస్ నాయకులు కృష్ణయాదవ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడు బుచ్చిరెడ్డి మృతి

దోమ: మండల కేంద్రానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు బుచ్చిరెడ్డి(82) మృతి చెందారు. సోమవారం పొలం వద్ద కాలుజారి పడటంతో తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన కుటుంబ సభ్యులు పరిగి ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మంగళవారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మా భూములను కాపాడండి


కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వచ్చిన చెంచులు

వికారాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): అక్రమార్కుల నుంచి తమ భూములను కాపాడాలని చెంచు కాలనీవాసులు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. వికారాబాద్ మునిసిపల్ పరిధిలో ఉన్న అనంతపద్మనాభ చెంచుకాలనీలో పలు చెంచు కుటుంబాలు జీవనం కొనసాగిస్తున్నాయి. వికారాబాద్‌లో చెంచు కాలనీ ఏర్పాటు చేసినప్పుడే చెంచుకుటుంబాల జీవనోపాధికి ప్రభుత్వం భూములు పంపిణీ చేసింది. చెంచుల భూములపై కన్నేసిన కొందరు అక్రమార్కులు ఆ భూములను ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారంటూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో పలువురు చెంచులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

వడివడిగా..

(ఐదో పేజీ తరువాయి)

భూమిని రైతుల నుంచి సేకరించిన తర్వాత హద్దులను సైతం ఏర్పాటు చేశారు. సేకరించిన భూములకు సంబంధించి రైతులకు పరిహారం సైతం ప్రభుత్వం అందించింది. పనుల్లో భాగంగా నిర్మాణ హద్దులను గుర్తించి ప్రహరీ నిర్మాణానికి యంత్రాలు, కూలీలను సిద్ధం చేశారు.

రైతులు స్వచ్ఛందంగా ముందుకు..

హకీంపేట్, పోలెపల్లి, లగచర్ల, పులిచర్ల కుంట తండా, రోటిబండ తండా పరిసరాల్లో ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణ పనులకు చర్యలు చేపట్టారు. ఇందుకుగాను నిత్యం జిల్లా స్థాయి అధికారులు పర్యటించి భూములకు హద్దులకు గుర్తించారు. కారిడార్ ఏర్పాటు కోసం ప్రభుత్వం 725 మంది రైతుల నుంచి 1,178 ఎకరాలకు నోటిఫికేషన్ జారీ చేసింది. కాగా, ఇప్పటి వరకు 650 మంది రైతుల నుంచి 974 ఎకరాల భూములను సేకరించినట్లు అధికారులు తెలిపారు. మిగతా భూములను సైతం ఇచ్చేందుకు రైతులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని అధికారులు తెలిపారు. సేకరించిన భూమికి సంబంధించి ఇప్పటి వరకు పరిహారం కింద దాదాపు రూ.200 కోట్లకుపైగా అందించారు. దాదాపు ఇండస్ట్రియల్ కారిడార్‌కు సంబంధించి భూ సేకరణ పూర్తయినట్లు తెలుస్తోంది.

పెరగనున్న ఉపాధి అవకాశాలు

అన్నీ రంగాల్లో వెనకబాటుకు గురైన కొడంగల్ ప్రాంతంలో ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుతో నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఈ ప్రాజెక్ట్ ప్రారంభమైతే పదో తరగతి, ఇంటర్ పూర్తి చేసిన వారికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. సీఎం సొంత నియోజకవర్గంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

రైతుల నుంచి పూర్తి సహకారం



భూ సేకరణలో రైతుల నుంచి పూర్తి సహకారం అందుతుంది. కలెక్టర్, సబ్ కలెక్టర్ తదితర అధికారుల చొరవతో రైతులు సానుకూలంగా స్పందిస్తున్నారు. ఇప్పటికే రైతులకు పరిహారం అందించాం. ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటుతో ఈ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

- కిషన్‌నాయక్, తహసీల్దార్ దుద్యాల

క్రైం కార్నర్

నిమజ్జనంలో గొడవకు దిగిన వారిపై క్రిమినల్ కేసులు

వికారాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కమలానగర్ సమీపంలో వినాయయక నిమజ్జనంలో భాగంగా ఆదివారం రాత్రి కొందరూ గొడవకు దిగి అక్కడ ప్రజల శాంతికి భంగం కలిగించారని వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు సీఐ భీమ్ కుమార్ తెలిపారు. నిమజ్జనంలో అనుమతి లేకుండా డీజే పెట్టిన నిర్వాహకుడిపై, డీజే వాడిన వినాయక నిర్వాహకులపై క్రిమినల్ కేసులు నమోదు చేశామని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలు ఆపాలి


తహసీల్దార్ గాయత్రికి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు

దౌల్తాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల ఇళ్ల స్థలాల్లో నిర్మాణాలను ఆపాలని దౌల్తాబాద్ మండల జర్నలిస్టులు సోమవారం తహసీల్దార్ గాయత్రికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2023లో మండలంలోని చంద్రకల్ గ్రామ శివారులోని సర్వేనంబర్ 29లో ఎకరా ప్రభుత్వ భూమిని ఇళ్ల స్థలాల కోసం కేటాయించి 15మందికి పట్టాలు అందించినట్లు తెలిపారు. పట్టాలు పంపిణీ చేసిన స్థలంలో పల్లె దవాఖానా నిర్మాణం చేపట్టడం సరైంది కాదన్నారు. ఇందుకు స్పందించిన తహసీల్దార్ చంద్రకల్‌కు వెళ్లి స్థలాన్ని పరిశీలించారు. పల్లె దవాఖానా నిర్మాణ పనులను నిలిపివేసి పక్కనే ఖాళీస్థలంలో నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


సీఎం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మోమిన్‌పేట్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ చేస్తున్న తప్పుడు ప్రచారాలకు నిరసనగా మోమిన్‌పేట్ పాత బస్టాండ్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కాళేశ్వరం నిర్మాణానికి రూ.94వేల కోట్లలోపే ఉన్నప్పటికీ కాంగ్రెస్ నాయకులు లక్షల కోట్ల అవినీతి జరిగిందని ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శించారు. రైతులు యూరియా కోసం రోడ్డెక్కి నిరసనలు చేస్తున్నా కాంగ్రెస్ మాత్రం ప్రజాసమస్యలను గాలికొదిలేసిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు


సర్టిఫికెట్లు చూపుతున్న అథ్లెటిక్స్

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో అంతర్జాతీయస్థాయిలో గుర్తింపు లభిస్తుందని తెలంగాణ సాంఘిక సంక్షేమగురుకుల కళాశాల ప్రిన్సిపాల్ స్నేహలత తెలిపారు. 11వ తెలంగాణ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఘట్‌కేసర్ మున్సిపాలిటీ అంకుశాపూర్‌లోని తెలంగాణ సాంఘికసంక్షేమ గురుకుల (మహేంద్రహిల్స్) డిగ్రీకళాశాల క్రీడాకారులు అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటి మెడల్స్ సాధించారు. స్వాతి కాంజలి 400 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకం, ఉషారాణి ఐదు కిలోమీటర్ల పరుగుపందెంలో రజత పతకం, మూడు కిలోమీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం సాధించింది. నందిని ఐదు కిలోమీటర్ల పరుగుపందెంలో కాంస్య పతకం గెలుచుకున్నారు. ఈసందర్భంగా వీరిని ప్రిన్సిపాల్ అభినందించారు. కార్యక్రమంలో బుద్వెల్ కళాశాల ప్రిన్సిపాల్ శారద, భువనగిరి ప్రిన్సిపాల్ శ్రీలత, పీడీలు రామలక్ష్మణ్, శేషుకుమారి, కోచ్ బిక్షపతి యాదవ్ పాల్గొన్నారు.

తైక్వాండో పోటీల్లో సత్తాచాటిన విద్యార్థులు

ఘట్‌కేసర్ రూరల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఓపెన్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో మర్రిపల్లిగూడకు చెందిన విద్యార్థులు సత్తాచాటారు. ఎదులాబాద్ డీఎస్ఆర్ గార్డెన్‌లో జరిగిన 30కేజీల సబ్‌జూనియర్ చాంపియన్‌షిప్ తైక్వాండో పోటీల్లోమర్రిపల్లిగూడకు చెందిన మడ్డి భవిష్య, మడ్డి ప్రణీత, కత్తి అభిలాష్, చిలుగూరి వినయ్‌లు గోల్డ్‌మెడల్ సాధించగా, ఈదుగల్ల తన్మయ్, మడ్డి భువనేష్‌లు సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిని కోచ్ గ్యార నాగరాజు, గ్రామస్తులు అభినందించారు.

నవాంద్గీలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపాలి


ఎంపీని కలిసిన కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సురేశ్

బషీరాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్(నవాంద్గీ) రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఆపాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు యెద్ల సురేశ్ విన్నవించారు. హైదరాబాద్‌లోని నివాసంలో ఎంపీని కలిసిన ఆయన మండల ప్రజలు రైళ్లలో రాకపోకలకు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే ఎక్స్‌ప్రెస్ రైళ్ల ఆపేందుకు రైల్వేశాఖ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోనున్నట్లు ఎంపీ తెలిపారని వివరించారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

పెద్దేముల్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు కాంగ్రెస్ పార్టీ యువనాయకులు మహిపాల్‌రెడ్డి అన్నారు. జనగాం గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన 19మంది లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. ఒక లబ్దిదారుడికి ఇంటి నిర్మాణానికి అధికారులతో కలిసి ముగ్గుపోశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రతన్‌సింగ్, ఏఈ అబ్దుల్ రహీం, పంచాయతీకార్యదర్శి నర్సింహారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

మహాధర్నాకు తరలిన ఉపాధ్యాయులు


పీఆర్‌టీయూ మహాధర్నాకు తరలివెళ్లిన ఉపాధ్యాయులు

వికారాబాద్, సెప్టెంబరు 1 (ఆంధ్రజ్యోతి): పీఆర్‌టీయూ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం సీపీఎస్‌కు వ్యతిరేకంగా హైదరాబాద్‌లో ఇందిరాపార్కు వద్ద జరిగిన మహాధర్నాకు జిల్లా నుంచి 15బస్సులు, 50 వాహనాల్లో ఉపాధ్యాయులు తరలివెళ్లారు. ఉపాధ్యాయ, ఉద్యోగులకు తీవ్రనష్టం కలిగిస్తున్న సీపీఎస్ విధానాన్ని వెంటనే రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధానకార్యదర్శి దోమ అమరనాథ్, గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి డిమాండ్ చేశారు.